# పాలక ముఠాల కుమ్ములాటలో

# సామాన్య ప్రజల్ని బలి పశువులుగా చేయవద్దు

**అభివృద్ధి** పేరిట పాలన వికేంద్రీకరణ చేయాలనీ ఆంధ్ర రాష్ట్ర రాజధానిని అమరావతి నుండి తరలించే ప్రయత్నాలు, రాష్ట్ర స్వార్థపర పాలక వర్గ ముఠాలలో తీవ్రతరమవుతున్న వైరుధ్యాలను బట్టబయలు చేస్తున్నాయి. చంద్రబాబు తన పాలక ముఠా ప్రయోజనాల కోసం ముక్కారు పంటలు పండే వేలాది ఎకరాలను అమరావతి రాజధాని నిర్మాణం పేరిట నయానో, భయానో గుంజుకోగా ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పాలక ముఠా పరిపాలనా వికేంద్రీకరణ పేరిట మరొక తరహా పాచికలతో ప్రజల్ని ఆటలాడిస్తోంది. ఆ రోజు ప్రజాస్వామిక వాదులయిన మేధావుల సూచనలను పట్టించుకోలేదు. మూడు నుంచి ఆయిదు వేల ఎకరాల ప్రభుత్వ భూములు గుంటూరు, విజయవాడ మధ్య లభించడానికి అవకాశముంది. కానీ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం ద్వారా ప్రజలపై రాజధానిని రుద్దారు. అప్పుడు అనేక ఆందోళనలు సాగాయి. వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభం కారణంగా రాష్ట్ర అభివృద్ధి ఘోరంగా కుంటుపడిపోగా, వాటిని సరిదిద్దవలసింది పోయి రాజధాని నిర్మాణమే అభివృద్ధికి తారక మంత్రం అన్నట్లు ప్రపంచ విఖ్యాతపొందే రాజధానిని నిర్మించబోతున్నట్లు ఊహల్లో ఉయ్యాలలూపారు. అభివృద్ధి పేరిట ప్రపంచబ్యాంకు ఆదేశాలు అమలు పరచడంలో రెండు పాలక ముఠాలు పోటీ పడుతున్నాయి తప్ప, రాష్ట్రం తన కాళ్ళపై తాను స్వయం పోషకంగా అభివృద్ధిచెందేటట్లు చేయగల స్వతంత్ర ప్రణాళికలు వీరి వద్ద లేవు.

ప్రపంచ మార్కెట్ శక్తుల, దేశీయ కార్పొరేట్ల ప్రయోజనాలకు లోబడిన స్థానిక కాంట్రాక్టర్ల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల, వందల కోట్లు గల సంపన్నుల, రాజకీయ అవినీతి పరుల స్వార్థపూరిత ప్రయోజనాలే రాష్ట్ర ప్రజల ప్రయోజనాలుగా తమ మీడియా ప్రచారాలతో సామాన్యులను నమ్మించడానికి ఎడతెగని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇవన్నీ ప్రజల వాస్తవ జీవన సమస్యల నుండి మౌలిక సమస్యల నుండి ప్రక్కదారి పట్టించడానికి పథకం ప్రకారం సాగిస్తున్న కుట్రపూరిత చర్యలే.

చంద్రబాబు అమరావతి ప్రాంతంలోని సంపన్న రైతాంగంలో దురాశలు రేపి సామాన్య రైతాంగాన్ని భూములు అప్పచెప్పకపోతే తమ భవిష్యత్తు గందరగోళమవుతుందని అభద్రత భావన వైపుకూ, చదరపు అడుగుల లెక్కన అమ్ముకునే అవకాశం వుందని చెప్పి ఆశల వైపుకూ చాకచక్యంగా తిప్పగలిగాడు. మిగిలిన నూటికి 90 మంది సన్నకారు రైతులను తమ భూములు యివ్వక తప్పని పరిస్థితిలోకి నెట్టాడు. గత్యంతరం లేని స్థితిలో తమ పూర్వీకుల కాలం నుంచి తరతరాలుగా జీవిస్తున్న సామాన్య ప్రజలు తమ గ్రామ ఆవాసాలను వదులుకొని దూర ప్రాంతం వెళ్ళే ఏర్పాట్లు చేసుకున్నారు. కౌలు రైతులూ, వ్యవసాయ కూలీలు భృతిని కోల్పోయి, బతుకు తెరువుకోసం దూరప్రాంతాలకు పోవాల్సివచ్చింది.

ఉమ్మడి రాష్ట్ర విభజనకు ముందు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానం చేసిన కేంద్ర ప్రభుత్వం దాని నుండి వెనక్కి వెళ్ళి ఆంధ్రులను మోసం చేసినట్లే, చంద్రబాబు ప్రభుత్వ వాగ్దానాలను అమలు జరపకుండా ప్రస్తుత జగన్మోహనరెడ్డి ప్రభుత్వం పరిపాలనా వికేంద్రీకరణ నినాదం లేపింది. ఈ దేశంలో పరిపాలనా వికేంద్రీకరణ ఇప్పుడే మొదలవడం లేదు. ఎప్పుడో గ్రామ పంచాయితీలు,మండల పరిషత్తులు,జిల్లా పరిషత్తులు,సహకారసంఘాల పేర్లతో వికేంద్రీకరణ పేరుకి జరిగింది. కానీ,సామాన్యులకు ఏమి ఒరిగినట్టు? కాకపోతే వివిధ స్థాయిలలో పెత్తందార్ల దొంతర మాత్రం పెరిగింది. కనుక పరిపాలనా వికేంద్రీకరణ, అధికార వికేంద్రీకరణ ఒకటి కాదు.

**సి.పి.ఐ (ఎం.ఎల్) పార్టీ నాలుగేళ్ళ క్రితం విజయవాడ, గుంటూరుల మధ్యలో రాజధాని నిర్మాణాన్ని వ్యతిరేకించలేదు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం సాగించిన హడావుడిని, ప్రపంచంలో కెల్లా మేటి రాజధానిని అత్యంత భారంతో కూడిన రాజధానినీ అంగీకరించలేదు. పైగా తన ఖచ్చితమైన విమర్శను ప్రజల ముందుంచింది.**

చంద్రబాబు నాయుడు గడిచిన ఐదేళ్ళ పరిపాలనలో అమరావతి రాజధాని పేరిట 33 వేల ఎకరాల సమీకరణేకాక, జిల్లాకొక లక్ష ఎకరాలు చొప్పున ల్యాండ్ బ్యాంక్‌ను ఏర్పరచినట్లు అందరికీ తెలుసు. ప్రాజెక్టులు, పోర్టులు ,సెజ్జుల పేరుతో సుమారు 12 లక్షల ఎకరాలకు పైగా సేకరించి కార్పొరేట్ల కొరకు అభివృద్ధి పేరిట వాటిని స్వాధీనపరుచుకున్నారు. కనుక పరిపాలన మూడు ప్రాంతాల నుంచి జరుపుకొన్నా, ఒక్కచోటనుంచి జరుపుకొన్నా పోయేదేమీ లేదు. పరిపాలనా ఆఫీసుల విభజన ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు పెద్దగా ఒరిగేదేమీ లేదు.

విశాఖ పట్టణ ప్రాంతంలో కూడా రెండు పాలక గ్రూపుల వారూ కావలసినన్ని భూములను, ఆస్తులను ఎప్పటి నుంచో కలిగి వున్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో అన్ని బూర్జువా పార్టీలకు చెందిన వారూ ఏభై నుంచి వందల ఎకరాల క్షేత్రాలను అమర్చుకొనే వున్నారు. కనుక ఈ సమస్య నూటికి 80 మందిగా వున్న సామాన్య ప్రజల సమస్య కాదు. స్థిరపడి వున్న

పెట్టుబడిదారులూ, కొత్తగా పెరిగిన పెట్టుబడిదారుల మధ్య సమస్య. పేదలు–కుల, ప్రాంత ప్రభావాలకు లోనుకాకూడదని మా పార్టీ కోరుతున్నది.

పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న, దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన సమస్యలను పరిశీలించమని ప్రజానీకాన్ని కోరుతున్నాము.

1. మన దేశ మౌలిక సమస్యలలోని పేదలకు భూమి సమస్య, పునరావాస సమస్య.
2. వ్యవసాయ సమస్యలలో పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధరల సమస్య, అప్పుల భారం సమస్య.
3. పారిశ్రామిక అభివృద్ధి సమస్యలలో కార్మికుల తీసివేతలు, పరిశ్రమల మూసివేతల సమస్య, కార్మికుల హక్కులపై దాడుల సమస్య, నిరుద్యోగ సమస్య,
4. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల సమస్య, దళితులూ, ఆదివాసులపై సాంఘిక దౌర్జన్యాలూ, అణచివేతల సమస్య.
5. మతతత్వ రాజకీయల అమలు మూలంగా వచ్చిన ఎన్.ఆర్.సి, సి.ఏ.ఏ.లపై అట్టుడుకుతున్న దేశ ప్రజలందరి సమస్య
6. దేశ దేశాలను కొల్లగొడుతున్న అమెరికా, యుద్ధోన్మాదాన్ని ప్రేరేపిస్తూ ఇరాన్‌ని కవ్విస్తూ, డ్రోన్‌ల సహాయంతో దాడులు చేస్తూన్న అమెరికా అగ్రరాజ్యాన్ని వ్యతిరేకించే సమస్య.

వీటన్నిటి నుంచి ప్రజలను పక్కదారి పట్టించడానికి వై.సి.పి మరియూ టి.డి.పిల నేతృత్వంలోని రెండు పాలక గ్రూపులు ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ సమస్యలపై రెండు పాలక గ్రూపులూ సూటిగా తమ వైఖరిని ప్రకటించడం లేదు. పెరుగుతున్న ఫాసిస్టు తరహా ధోరణుల పట్ల వీరి వైఖరేమిటి ? రాజ్యాంగ పరిధిలో ఆలోచించినా కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ, అతుకుల బొంతగా వున్న ఫెడరల్ వ్యవస్థను కూడా మిగల్చకుండా అత్యంత నియంతృత్వ పద్ధతిలో, ఫాసిస్టు తరహా ధోరణితో వ్యవహరించడాన్ని, రాజధాని నిర్మాణం కోసం చేస్తామన్న సహాయం గురించి పట్టించుకొనని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేయవలసిన పోరాటాన్ని వదిలేస్తున్నారు. రెండు గ్రూపులు గాలిలో కత్తులు తిప్పుకొనడాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు.

ఇలాంటి స్థితిలో ప్రజలు తమ మౌలిక జీవన సమస్యలపై పోరాటాలను కొనసాగించాలని కోరుతున్నాము. అమరావతిలో జరుగుతున్న ఆందోళనలలో పాల్గొంటున్న రైతులూ, మహిళలపై అమలు జరుగుతున్న పోలీసుల దౌర్జన్యాలను ఖండిస్తున్నాము. కుల విద్వేషాలు, ప్రాంతీయ ఉన్మాదాలు రగలకుండా సంయమనంతో వ్యవహరించమని యావత్ ప్రజానీకాన్ని కోరుతున్నాము.

**11-01-2020**

**రాష్ట్ర కమిటి**
**సి.పి.ఐ (ఎం.ఎల్)**

ooo